వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

● జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి


ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో వైద్య అధికారులతో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటి

ముషీరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది విధి నిర్వహణలో తప్పనిసరి సమయ పాలన పాటించాలని హైదరాబాద్ జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి ఆదేశించారు. నిర్లక్ష్యం వహించే వైద్య సిబ్బందిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని(యూపీహెచ్‌సీ) డాక్టర్ వెంకటి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య మహిళా, చిన్నారుల వ్యాక్సిన్, గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు సమయ పాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అశ్రిత, ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దీప్తి ప్రియాంక, పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

ముషీరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఉచిత జాబ్‌మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్(ఎస్ఆర్‌డీ) సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మంగళవారం రాంనగర్‌లోని ఎస్ఆర్‌డీ కార్యాలయంలో ఉచిత జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్‌మేళాను ప్రారంభించిన అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. ఈ జాబ్‌మేళాలలో ఐదు ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలు పాల్గొన్నాయని తెలిపారు. ఇంటర్వ్యూలకు 80 మంది నిరుద్యోగులు హాజరవ్వగా 41మంది ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌డీ సంస్థ సిబ్బంది క్రాంతి కిషోర్, మహదేవ్, రజిని, రమణి, వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలి

బర్కత్‌పుర, మే 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 11 యూనివర్సిటీల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలని యూనివర్సిటీస్ టీచర్స్ అసోసియేషన్ (సీ) తెలంగాణ స్టేట్ డిమాండ్ చేసింది. 7వ వేతన సవరణను అమలు చేయాలని కోరింది. మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఏ.పరుశురామ్, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఢీకొండ తిరుపతి, డాక్టర్ నిరంజన్, వర్కింగ్ ప్రెసిడెంట్లు డాక్టర్ జితేందర్‌రెడ్డి, కరుణాకర్ మాట్లాడారు. రాష్ట్రంలో 1500 మంది కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు 25 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారని, వారికి జూనియర్ కళాశాల లెక్చరర్ల కంటే తక్కువ వేతనాలు ఇస్తూ వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని వారు ఆరోపించారు. తమ సర్వీస్‌ను క్రమబద్ధీకరిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొందని, సీఎం రేవంత్‌రెడ్డి న్యాయం చేయాలని వారు కోరారు. సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ భీమయ్య, డాక్టర్ శ్యామ్‌సుందర్, డాక్టర్ రామకృష్ణయ్య పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి : రాంకోటి


సమావేశంలో నినాదాలు చేస్తున్న తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం నాయకులు

రాంనగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అల్లంపల్లి రాంకోటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా బీసీలకు 20 శాతం నుంచి 42 శాతం రిజర్వేషన్లను పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలు నిర్వహిస్తే బీసీలకు స్థానిక సంస్థలలో తీరని నష్టం జరుగుతుందని అన్నారు. బీసీ కులగణన వెంటనే చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ విద్యార్థి, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనంతుల రామ్మూర్తిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

43 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తేనే బీసీలకు న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్ ఓంకార్

రాంనగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): 1980లో మండల్ కమిషన్ ఇచ్చిన రిపోర్టు ప్రకారం 43 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తేనే బీసీ సమాజానికి న్యాయం జరుగుతుందని ఎంసీపీఐ(యూ) జాతీయ కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగణన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే జనగణన చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, నాయకులు వనం సుధాకర్, కుమారస్వామి, సుకన్య వెంకన్న, మట్టయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల బకాయిలను విడుదల చేయాలి


కార్మిక శాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ధర్మసమాజ్ పార్టీ నేతలు

బర్కత్‌పుర, మే 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా కార్మికులకు రావాల్సిన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రవిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆరు నెలలుగా కార్మికుల సంక్షేమానికి సంబంధించి బకాయిలు, బిల్లులు ఆగిపోయాయని దీని వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. స్పందించిన కమిషనర్ బకాయి బిల్లులను విడుదల చేస్తామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ నేతలు మంద జ్యోతి. శ్రావణ్ మహరాజ్, వెంకటప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కవాడిగూడ, మే 21 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో కామారెడ్డి జిల్లాకు చెందిన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని భోలక్‌పూర్ కృష్ణానగర్ కాలనీలో మంగళవారం జరిగింది. గాంధీనగర్ సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం సంగోజి వాడి ప్రాంతానికి చెందిన గడ్డం శివరాజు(45) రైతు. శివరాజు కుమారుడు నితిన్ ఫొటోగ్రాఫర్. నితిన్ భార్య డెలివరీ కోసం ఈనెల 15న గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. మరుసటి రోజు నితిన్ భార్యకు వైద్యులు సర్జరీ చేశారు. ఆమెకు కుమారుడు జన్మించాడు. వారం రోజులపాటు ఆస్పత్రిలోనే ఉండాలని వైద్యులు చెప్పడంతో శివరాజు ఆస్పత్రి దగ్గర ఫుట్‌పాత్‌పై ఉంటున్నాడు. అయితే, ఈ నెల 20న రాత్రి కామారెడ్డి నుంచి వచ్చిన ఫోన్ మాట్లాడిన శివరాజు ఆస్పత్రికి ఎదురుగా ఉన్న కృష్ణానగర్ కాలనీలోకి వెళ్లి అర్ధరాత్రి రెండు గంటల ప్రాంతంలో ఓ ఇంటికి ఉన్న ఇనుప రాడుకు చొక్కాతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకున్న వ్యక్తిని చూసిన బస్తీవాసులు గాంధీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. నితిన్ వచ్చి మృతుడు తన తండ్రి శివరాజుగా గుర్తించాడు. నితిన్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


ముషీరాబాద్‌లో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, మాజీ అధ్యక్షుడు జీఎన్ చారి, మాజీ కార్పొరేటర్ సరిత గోవింద్ తదితరులు



బర్కత్‌పురలోని కాంగ్రెస్ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు, నాయకులు బాల్‌రాజ్, ఓంప్రకాష్, మల్లేష్, దీపక్ తదితరులు


అశోక్‌నగర్ చౌరస్తాలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నెడి, నాయకులు వి.డి.కృష్ణ, మధుమతి, జయేంద్రబాబు తదితరులు

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 33వ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లోని ఆయా ప్రాంతాల్లో కాంగ్రెస్, ఆ పార్టీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ విగ్రహాలకు, చిత్రపటాలకు నాయకులు, అభిమానులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలను పలువురు కొనియాడారు.

- ముషీరాబాద్/అంబర్‌పేట జోన్ బృందం(ఆంధ్రజ్యోతి)


శంకరమఠంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీపీసీసీ కార్యదర్శి అజయ్‌కుమార్, టీపీసీసీ ఎస్సీ సెల్ మాజీ చైర్మన్ శ్యామ్‌రావు తదితరులు


సోమాజిగూడలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంజిరెడ్డి, నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, వెంకటగోవింద్‌రావు, విజయ్‌కుమార్ తదితరులు

సాయిబాబా ఆలయ నిర్మాణానికి సహకరించండి

● ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్


సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపనకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ, మే 21 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్ బండమైసమ్మనగర్‌లో గల పహాడి హనుమాన్ దేవాలయంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న శ్రీ షిరిడి సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాన, ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ సూచించారు. మంగళవారం కవాడిగూడ డివిజన్ బండమైసమ్మనగర్‌లోని పహాడి హనుమాన్ దేవాలయంలో షిరిడీ సాయిబాబా విగ్రహం ప్రతిష్ఠించేందుకు జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్ దంపతులు, కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ రచనశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తమవంతు సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తండా రాములు, తండా శ్రీకాంత్, కెన్ మూర్తి, ధన్‌రాజ్, బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, బీఆర్ఎస్ వాడిగూడ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, బీఆర్ఎస్ నేతలు రాములు, రమణ, సంతోష్, జి రాములు తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలపై ఐక్య పోరాటానికి సిద్ధం కావాలి

● రైతు సంఘం నాయకులు మల్లారెడ్డి, సాగర్



సమావేశంలో మాట్లాడుతున్న సారంపల్లి మల్లారెడ్డి

రాంనగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాల వల్ల వ్యవసాయ రంగం సంక్షోభం ఎదుర్కొంటుందని, ఈ నేపథ్యంలో రైతాంగ సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని రైతు సంఘం నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, టి.సాగర్ పిలుపునిచ్చారు. మంగళవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ విస్తృత సమావేశం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 2020-21 నుంచి వ్యవసాయ ప్రణాళిక ప్రకటించడం గానీ, ఆన్‌లైన్‌లో పెట్టడం గానీ చేయడం లేదన్నారు. రాష్ట్రంలో ప్రతియేటా 4, 5 లక్షల ఎకరాలలో కల్తీ విత్తనాల వల్ల పంటలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెటింగ్ శాఖ ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు అందించాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి, అరిబండి ప్రసాదరావు, పి.జంగారెడ్డి, బొంతల చంద్రారెడ్డి, వి.వెంకటేశ్వర్లు, మాదినేని రమేష్, ప్రమీల, వెంకటరెడ్డి, సహాయ కార్యదర్శులు శోభన్, బాలకృష్ణ, రాంబాబు, సత్యనారాయణ, బాబు, సత్తిరెడ్డి, వెంకటేష్, బాల్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, రాంచందర్, వాసుదేవరెడ్డి, అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.

మహాబోధి బుద్ధవిహార్‌లో రేపు బుద్ధ జయంతి వేడుకలు


కొలువుదీరిన తథాగతుడు

చిలకలగూడ, మే 21 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి, మహేంద్ర హిల్స్‌లోని మహాబోధి బుద్ధవిహార్‌లో గురువారం బుద్ధ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆధ్యాత్మిక వేత్త ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో 2003లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, బౌద్ధ భిక్షువు దలైలామా మహాబోధి బుద్ధవిహార్‌ను లాంచనంగా ప్రారంభించారు. మూడంతస్తుల్లో దీనిని నిర్మించారు. లిఫ్ట్, విశాలమైన పార్కింగ్ సౌకర్యాలు ఉన్నాయి. రోజూ ఉదయం 7 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం ఐదు నుంచి 8 గంటల వరకు తెరిచి ఉంటుంది. ప్రవేశ రుసుము లేదు. ఇక్కడ ధ్యానం, బుద్ధ ప్రవచనాలు నిర్వహిస్తారు. పర్వదినాలు, పండుగ వేళల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. దేశ, విదేశాల నుంచి బౌద్ధులు ఇక్కడికి వస్తుంటారు. ధ్యానం చేసుకోవడానికి ఇక్కడ అన్ని సౌకర్యాలు ఉన్నాయి.

వేడుకలకు సీఎం రేవంత్‌రెడ్డి రాక

వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని విహార్ ప్రతినిధి చేతన్ తెలిపారు. ప్రత్యేక పూజల్లో పాల్గొంటారని, పుస్తకావిష్కరణకు, సందేశం అందించటానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. భక్తుల కోసం సదుపాయాలు కల్పించినట్లు ఆయన తెలిపారు.


రేలంగి నరసింహారావును సత్కరిస్తున్న అతిథులు

రేలంగి నరసింహారావుకు దాసరి పురస్కారం

రవీంద్రభారతి, మే 21 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ, దాసరి నారాయణరావులు తెలుగు జాతికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన మహనీయులని వక్తలు అభివర్ణించారు. మంగళవారం రవీంద్రభారతిలో సీల్‌వెల్ కార్పొరేషన్, శృతిలయ ఫౌండేషన్, శ్రీభారతి మ్యూజిక్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఎన్టీఆర్, ఏఎన్నాఆర్, కృష్ణ, దాసరి నారాయణరావులకు స్వరనీరాజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నరసింహారావుకు దాసరి నారాయణరావు పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా హాజరై పురస్కార గ్రహీత రేలంగి నరసింహారావును ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు సినీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే ఎన్టీఆర్, ఏఎన్నార్, దాసరిలను స్మరించుకుంటూ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో సీల్‌వెల్ అధినేత బండారు సుబ్బారావు, సీనియర్ జర్నలిస్టు మహ్మద్ రఫీ, కుసుమ భోగరాజు, రామకృష్ణ, గాయని వేమూరి మంజుల పాల్గొన్నారు. సభకు ముందు ప్రముఖ గాయని ఆమని నేతృత్వంలో నిర్వహించిన సీల్‌వెల్ సుస్వరాలు ప్రేక్షకుల్ని అలరించాయి. చక్కటి గీతాలాపనతో సినీ ప్రముఖులకు స్వరనీరాజనం పలికారు.


వీఎస్టీ నుంచి రాంనగర్ వెళ్లే మెయిన్ రోడ్‌లో ప్రమాదకరంగా ఉన్న చెట్లు


బాగ్‌లింగంపల్లిలో ప్రమాదకరంగా ఉన్న చెట్టు

వేర్లు తేలిన చెట్లతో జాగ్రత్త

● ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో ప్రమాదకరంగా చెట్లు

రాంనగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ పరిధిలోని పలు ప్రధాన రహదారులతో పాటు బస్తీలు, కాలనీలలో ఉన్న పురాతన, వేర్లు తేలిన స్థితిలో ఉన్న చెట్ల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పాదచారులు, వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ఆ మార్గంలో ప్రయాణిస్తున్నారు.

ప్రధానంగా వీఎస్టీ నుంచి రాంనగర్ వెళ్లే ప్రధాన మార్గంలో ఫుట్‌పాత్‌లపై ఉన్న చెట్ల వేర్లు భూమిలోంచి తేలి రోడ్డుపైకి వంగి ప్రమాదకరంగా ఉన్నాయి. ఫుట్‌పాత్‌ల మరమ్మతుల పేరుతో చెట్ల మొదలు వద్ద ఉన్న మట్టిని పూర్తిగా తొలగించారు. కానీ, ఫుట్‌పాత్ నిర్మాణం చేపట్టకపోవడంతో ఆ చెట్లకు భూమిలో పట్టులేక పడిపోయే స్థితికి చేరాయి. అదే విధంగా బాగ్‌లింగంపల్లిలోని ఎల్ఐజీ, ఎంఐజీ క్వార్టర్స్‌తో పాటు పలు చోట్ల చెట్లు ప్రమాదకరంగా ఉన్నాయి. వర్షాలు బాగా పడితే చెట్లు భూమిలో పట్టుకోల్పోయి పడిపోయే ప్రమాదం ఉంది. వెంటనే జీహెచ్ఎంసీ హార్టికల్చర్ విభాగం అధికారులు స్పందించి చెట్లు పడిపోకముందే తగు జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు వాహనదారులు, పాదచారులు కోరుతున్నారు. మంగళవారం బొల్లారంలో ఓ చెట్టు కూలి భర్త చనిపోయి భార్యకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

చెట్లు పడిపోకుండా చర్యలు చేపడతాం

వీఎస్టీ నుంచి రాంనగర్ వెళ్లే మెయిన్ రోడ్డుతో పాటు ముషీరాబాద్ సర్కిల్ పరిధిలోని పలు బస్తీలు, కాలనీలలో ప్రమాదకరంగా ఉన్న చెట్లు కూలిపోకుండా తగిన చర్యలు చేపడతాం. కూలిపోయే ప్రమాదం ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తాం. చెట్లను నరికివేసే అధికారం తమకు లేదు. వర్షాల వల్ల కూలిపోయిన చెట్లను వెంటనే తరలిస్తాం.

- భాస్కర్, హార్టికల్చర్ విభాగం అధికారి

టీజేఎస్ గ్రేటర్ ఉపాధ్యక్షుడిగా జైపాల్‌రెడ్డి


జైపాల్‌రెడ్డికి నియామక పత్రం అందజేస్తున్న ప్రొఫెసర్ కోదండరాం. నర్సయ్య

రాంనగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడిగా ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు పులిరెడ్డి జైపాల్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరాం ప్రకటించి, మంగళవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ ముషీరాబాద్ నియోజకవర్గంలో పార్టీ పటిష్ఠతకు కృషి చేస్తానన్నారు. పార్టీకి తాను చేసిన సేవలను గుర్తించి ఈ పదవి ఇచ్చినందుకు అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంచందర్, జశ్వంత్, మెరుగు శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


చర్చా కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్త చాన్

స్టెమ్‌సెల్ చికిత్సతో విప్లవాత్మక మార్పులు

హైదరాబాద్ సిటీ, మే 21 (ఆంధ్రజ్యోతి): స్టెమ్‌సెల్ చికిత్సతో ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని శాస్త్రవేత్త, స్టెమ్‌సెల్స్, ఇమ్యునాలజీ, రీసెర్చ్ మెడిసన్ రచయిత, ఈడబ్ల్యూబీజీ ఫౌండర్ ప్రొఫెసర్ డాక్టర్ మైక్ చాన్ పేర్కొన్నారు. వ్యక్తి ఆరోగ్య పరిస్థితులకు తగినట్లుగా ప్రత్యేక చికిత్స అందిస్తున్నట్టు ఆయన తెలిపారు. యూరోపియన్ వెల్‌నెస్ బయోమెడికల్ గ్రూప్ (ఈడబ్ల్యూబీజీ) మంగళవారం గచ్చిబౌలిలోని ఐఐటీ క్యాంపస్‌లో విద్యార్థులతో చర్చా కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా చాన్ మాట్లాడుతూ వ్యక్తుల అవసరాలను గుర్తించి అందుకనుగుణంగా చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఐఐటీ విద్యార్థులు, సినీ నిర్మాత ఏ.ఎం. రత్నం, జనసేన పార్టీ ప్రధానకార్యదర్శి సత్యనారాయణ, ఈడబ్ల్యూబీజీ భారత్ సైంటిఫిక్ రీసెర్చ్, డైరెక్టర్, సీఈఓ డాక్టర్ రవితేజ అల్లం, సీనియర్ మెడికల్ ఎడ్వైజర్ ప్రొఫెసర్ ఓల్గా నిశాకుషై పాల్గొన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాలు

చిక్కడపల్లి, మే 21(ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం నుంచి ఈనెల 30 వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తామని ఆలయ వ్యవస్థాపక వంశీయులు జి.రాజేంద్రనాథ్ గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో రామాంజనేయులు తెలిపారు. అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు వారు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని వారు సూచించారు.

తెలంగాణ దశాబ్ది వేడుకల క్రికెట్ కప్ విజేత 'భవానీ టైగర్స్'


క్రికెట్ కప్ అందుకుంటున్న భవానీ టైగర్స్ టీమ్ కెప్టెన్ ప్రశాంత్

బర్కత్‌పుర, మే 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన తెలంగాణ దశాబ్ది వేడుకల క్రికెట్ కప్ పోటీలో విజేతగా భవానీ టైగర్స్ టీమ్ నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా 21 క్రికెట్ జట్లు ఈ పోటీలో పాల్గొన్నాయని ఫైనల్ పోటీలో భవానీ టైగర్స్ టీమ్ ఆర్‌వీఎల్ఎల్ఎస్ మెదక్ టీమ్‌పై విజయం సాధించిందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.సంగమేశ్వర్, గౌరవ అధ్యక్షుడు వెన్నె ఈశ్వరప్ప తెలిపారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఈ క్రికెట్ కప్‌ను భవానీ టైగర్స్ టీమ్ కెప్టెన్ ప్రశాంత్ అందుకున్నారని వారు తెలిపారు. క్రీడలను ప్రోత్సహించడానికి తమ సంఘం ఆధ్వర్యంలో క్రికెట్‌తో పాటు వివిధ క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశామన్నారు. సంఘం మహిళా అధ్యక్షురాలు శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్‌లో చెట్ల కొమ్మల తొలగింపు


గంగపుత్ర కాలనీలో చెట్ల కొమ్మలను తొలగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

ముషీరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలులకు ముషీరాబాద్ డివిజన్‌లోని గంగపుత్ర కాలనీ, కళాధర్‌నగర్‌లలో భారీ వృక్షాల కొమ్మలు ప్రమాదంగా మారడంతో మంగళవారం జీహెచ్ఎంసీ అర్బికల్చర్ సిబ్బంది తొలగించారు. ముషీరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు పూసగోరక్‌నాథ్ ప్రమాదంగా ఉన్న చెట్ల కొమ్మలను సిబ్బందితో తొలగింపజేశారు.